# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :03 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 23-02-2025 | పేజీలు:4 వెల: 2.00


## పదేళ్లుగా కృష్ణా వాటాల బిఆర్ఎస్ మౌనం

హైదరాబాద్, తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా కేంద్రప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్సీ, టీజేఎస్ చీఫ్ కోదండరాం ఫైర్ అయ్యారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, టీజేఎస్ తరపున గట్టిగానే నిలదీస్తామని స్పష్టం చేశారు. నాంపల్లిలోని ఆఫీసులో ఆయన మీడిఆయతో మాట్లాడిన ఆయన.. 'తెలంగాణ ఉద్యమానికి మూల కారణాలైన వాటిలో నీళ్ల పంపకం ఒకటి. కృష్ణాజలాల నీటి వివాదంపై గత పదేండ్లు అధికారంలో ఉండి కూడా మాట మాట్లాడకుండా ఉన్న బీఆర్ఎస్ నేతలు.. ఇపుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి తాము పోరాటం చేస్తామని ముందుకు రావడం హాస్యాస్పదంగా ఉంది.. . గత పదేండ్లలో మీరు మౌనం వహించడం వల్లే.. ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడింది' అని మండిపడ్డారు.తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామని ఎమ్మెల్సీ, టీజేఎస్ చీఫ్ కోదండరాం తెలిపారు. కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీగా అశోక్ కు, నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో గోపాల్ రెడ్డికి మద్దతిస్తామన్నారు.

## మొండి బకాయిలపై జీహెచ్ఎంసీ స్పెషల్ ఫోకస్..




హైదరాబాద్, పన్ను వసూళ్లపై ఫోకస్ పెంచింది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. ఇప్పటికే నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో 62 ఆస్తులను సీజ్ చేసింది GHMC. ఉదయం బంజారా హొటల్‌ను కూడా సీజ్ చేసింది. దీంతో మొత్తం ఒక కోటి 43 లక్షలకు గాను 51 లక్షల డబ్బులు చెల్లించింది బంజారా హొటల్. GHMC 5వేల 500 కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు ఉన్నాయి. దీంతో మొండి బకాయిలను వసూలు చేయడమే లక్ష్యంగా ప్రత్యేక ఫోకస్ చేసింది జిహెచ్ఎంసి.ప్రతి సర్కిల్లో టాప్ 100 డీ ఫాల్టర్‌లపై శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు కమిషనర్ ఇలంబర్తి. గతేడాది మొత్తం 1960 కోట్ల రూపాయల టాక్స్ వసూలు చేసింది జిహెచ్ఎంసి. ఈ ఏడాది 2 వేల కోట్ల వరకు టాక్స్ వసూలు చేయాలని టార్గెట్ గా పెట్టుకున్నారు అధికారులు. ఇప్పటి వరకు కేవలం 1484 కోట్లు వసూలు చేసింది జిహెచ్ఎంసి. ఇంకా వసూలు చేయాల్సిన టార్గెట్ భారీగా ఉండడంతో టాక్స్ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం అధికారులు.వివరాల్లోకి వెళ్తే.. ప్రాపర్టీ ట్యాక్స్ మొండి బకాయిలపై జీహెచ్ఎంసీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. 15 ఏళ్లుగా ట్యాక్స్ ?చెల్లించని ప్రాపర్టీలను గుర్తించి నోటీసులు ఇస్తోంది. స్పందన లేకపోతే సీల్ వారెంట్‌లు జారీ చేస్తోంది. తాజాగా తాజ్‌బంజారా హొటల్‌కు అధికారులు సీల్ వేయగా.. వెంటనే స్పందించిన యాజమాన్యం ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించింది. వందశాతం ప్రాపర్టీ ట్యాక్ వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండడంతో.. అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నెలలో ఆరు లక్షల ప్రాపర్టీలకు నోటీసులు ఇచ్చారు. 60 ప్రాపర్టీలకు సీల్ వారెంట్లు జారీ చేసినట్లు సమాచారం.15 ఏళ్లుగా జీహెచ్ఎంసీకి ప్రాపర్టీ ట్యాక్స్ కింద 11 వేల 668 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో 4 వేల రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల నుంచి 5 వేల కోట్లు.. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 600 ఆస్తుల నుంచి 500 కోట్లు ఉన్నాయి. ఏటా బకాయిలు పెరగటంతో ఉన్నతాధికారులు ట్యాక్స్ బకాయిదారులపై ఫోకస్ పెట్టారు. ట్యాక్స్ కలెక్షన్ కోసం రెవెన్యూ రికవరీ యాక్టు సెక్షన్269 (2) ప్రకారం నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి సీల్ చేసి మరీ పన్ను కలెక్ట్ చేస్తున్నారు. ఇందులో 60 ప్రాపర్టీలు సీల్ చేసి ట్యాక్స్ కలెక్ట్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాపర్టీలకు సంబంధించి ఆయా శాఖలకు %+ౕవీజ% లేఖలు రాయనున్నట్లు తెలిసింది.గ్రేటర్ లో 19.5 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. వీరిలో రెండున్నర లక్షల మంది కమర్షియల్ ట్యాక్స్, 17 లక్షల మంది రెసిడెన్షియల్ ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 12 లక్షల 50 వేల మంది ట్యాక్స్ చెల్లించారు. 14 వందల 84 కోట్ల ట్యాక్స్ వసూలైంది. బల్దియా టార్గెట్ 2 వేల కోట్లు కాగా.. 40 రోజుల్లో 516 కోట్లు వసూలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

## ఫాల్కన్ స్కామ్.. కేసు నమోదుచేసిన ఈడీ




హైదరాబాద్: తమ కంపెనీలో డిపాజిట్లు పెడితే తక్కువ కాలంలోనే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి 6979 మందికి కుచ్చుటోపీ పెట్టిన ఫాల్కన్ స్కామ్‌పై (ఫాల్కన్ స్కామ్) ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదుచేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించింది. హైదరాబాద్ కేంద్రంగా సాగిన ఈ స్కాంలో దేశవ్యాప్తంగా రూ.1700 కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. 22 డబ్బు విక్రయ కంపెనీల ద్వారా ఆ విదేశాలకు మళ్లించినట్లు తేలింది. దుబాయ్, మలేషియా, సింగపూర్‌కు డబ్బు పంపినట్లు ఈడీ గుర్తించింది.కాగా, ఒక్క హైదరాబాద్‌లోనే రూ.850 కోట్లు కుచ్చుటోపీ పెట్టినట్లు సైబరాబాద్ ఆర్థికనేరాల విభాగం గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో 19 మందిపై ఎఫ్ఐఆర్ నమోదుచేయగా, పవన్ కుమార్ ఓదెల, కావ్య నల్లూరి, అనంతను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితులైన ఫాల్క్ క్యాపిటల్ వెంట్రస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అమర్ దీప్ కుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆర్యన్ సింగ్, సీఈవో యోగేందర్ సింగ్ దుబాయ్ పారిపోయారు. ఈ నేపథ్యంలో అమర్‌దీప్ కుమార్‌పై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు.కాగా, అమర్‌దీప్ కుమార్ 2021లో ఫాల్కన్ క్యాపిటల్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ సంస్థను స్థాపించారు. ఓ ముఠాను ఏర్పాటు చేసి ప్రజలను నమ్మించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. డిపాజిటర్లను ఆకర్షించేందుకు మొబైల్ అప్లికేషన్, వెబ్‌సైట్‌ను రూపొందించారు. తాము అమెజాన్, బ్రిటానియా, గోద్రేజ్ వంటి పేరొందిన కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని నమ్మబలికారు. ఎవరైనా రూ.25వేల నుంచి రూ.9లక్షల వరకు డిపాజిట్ చేయాలంటే, ఏడాదికి 11 నుంచి 22 శాతం లాభం ఉంటుందని ప్రచారం చేశాడు. మొత్తం 6979 మంది డిపాజిటర్ల నుంచి రూ.1700 కోట్లు పెట్టుబడి రూపంలో వసూలు చేశాడు. వీటిని వివిధ రూపాల్లో 14 కంపెనీలలో పెట్టుబడులు పెట్టినట్లు తెలిపాడు. కానీ ఇందులో కొన్ని నకిలీ ఒప్పందాలుగా పోలీసులు తేల్చారు.కంపెనీ యజమానులు కొందరు డిపాజిటర్లకు రూ.850 కోట్లు తిరిగి చెల్లించగా ఇంకా రూ.850కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. నిందితులపై గతంలోనూ మల్టీలెవల్ మార్కెటింగ్ కింద కేసులు నమోదైనట్టు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఓదెల పవన్‌కుమార్, డైరెక్టర్‌గా పనిచేస్తున్న నెల్లూరి కావ్యను అరెస్టు చేశారు.

## కట్నం అడగకున్నా 498ఏ.. ఏ హాని తలపెట్టినా సెక్షన్ వర్తింపు



న్యూఢిల్లీ : వరకట్న వేధింపుల నిషేధ చట్టంగా పేరొందిన ఐపీసీ సెక్షన్ 498ఏకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సెక్షన్ కింద నేరం రుజువు చేసేందుకు భర్త వరకట్నం డిమాండ్ చేయాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. వివాహిత పట్ల ఏ రకంగా క్రూరత్వం చూపినా ఈ చట్టం వర్తిస్తుందని పేర్కొన్నది. వరకట్నం కోసం డిమాండ్ చేయలేదనే కారణంతో ఓ వ్యక్తిపై నమోదైన 498ఏ కేసును ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ వివాహిత దాఖలు చేసిన పిటిషన్‌ను తాజాగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలేతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది.'ఏ రకమైన క్రూరత్వం చూపించినా లేదా వరకట్నం డిమాండ్ చేసినా ఐపీసీ సెక్షన్ 498ఏ వర్తిస్తుంది. శిక్షార్హమైన నేరం అవుతుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది. 'మానసికంగా లేదా శారీరకంగా హాని తలపెట్టేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రవర్తించినా(క్లాజ్ ఏ) లేదా మహిళ, ఆమె కుటుంబాన్ని చట్టవిరుద్ధమైన డిమాండ్‌ను నెరవేర్చమని వేధించినా(క్లాజ్ బీ) సెక్షన్ 498ఏ వర్తిస్తుంది' అని పేర్కొన్నది. 'వరకట్న వేధింపుల వల్ల మరణాలతో పాటు వివాహిత మహిళపై అత్తింటివారి వేధింపుల కేసులను సమర్థంగా ఎదుర్కోవడానికి ఈ చట్టం వచ్చింది' అని పార్లమెంటును ఉటంకిస్తూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది.

## ముగ్గురు ఐపీఎస్ అధికారులకు కేంద్రం షాక్..




హైదరాబాద్,తెలంగాణలోని ముగ్గురు ఐపీఎస్ అధికారులకు కేంద్ర షాక్ ఇచ్చింది. అంజనీ కుమార్, అభిలాష్ బిస్తా, అభిషేక్ మహంతీలను రిలీవ్ చేయాలని కేంద్రం తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ముగ్గురు అధికారులను వెంటనే ఆంధ్రాకు రిపోర్టు చేయాలని కేంద్ర హొంశాఖ ఆదేశించింది.ప్రస్తుతం డీజీ హొదాలో కొనసాగుతున్న అంజనీకుమార్ రోడ్డు భద్రత డీజీగా ఉన్నారు. డీజీ హొదాలో ఉన్న మరో ఐపీఎస్ అధికారి అభిలాష్ బిస్తా పోలీస్ ట్రైనింగ్ డీజీగా ఉన్నారు. ఎస్పీ హొదాలో కొనసాగుతున్న అభిషేక్ మహంతి ప్రస్తుతం కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు.కాగా, రాష్ట్ర విభజన సమయంలో ఈ అధికారులను ఏపీకి కేటాయించారు. అయితే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో ఐపీఎస్ అధికారులు తెలంగాణలో కొనసాగుతున్నారు. అయితే అంజనీకుమార్, అభిలాష్ బిస్తా, అభిషేక్ మహంతిలను తక్షణమే రిలీవ్ చేయాలని ఆదేశించిన కేంద్ర హొంశాఖ.. వెంటనే ఏపీ క్యాడర్‌లో రిపోర్టు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## తెలంగాణలో దేవాలయాలకు టీటీడీ తరహాలో ట్రస్ట్ బోర్డు : రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం



హైదరాబాద్,తెలంగాణలోని ఆలయాల్లో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి సర్కార్ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవాలయానికి సంబంధించిన తరహాలో ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా చర్యలు చేపట్టనుంది.1987 దేవాదాయ చట్టానికి సవరణను రేవంత్ రెడ్డి సర్కార్ ఆమోదించింది. ఈ ఏడాది మార్చిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ముందు ఈ బిల్లును కేబినెట్ ఆమోదం తెలపనుంది.రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల నిర్వహణలో మరింత పారదర్శకతను తీసుకురావడానికి ఈ చట్ట సవరణ దోహదపడుతోంది. ఈ చట్ట సవరణ ద్వారా టీటీడీ తరహాలో ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు వెసులుబాటు లభిస్తోంది. రాష్ట్రంలో ప్రధానంగా యాదగిరిగుట్ట, వేములవాడ ఆలయాలకు ప్రతి ఏటా 100 కోట్ల ఆదాయం వస్తోంది.చట్ట సవరణ ద్వారా వారసత్వ ధర్మకర్తల వ్యవస్థను సంస్కరించేందుకు దోహదపడుతోంది. కొత్తగా ఏర్పాటు చేసే ఆలయ బోర్డుల్లో వంశపారంపర్య ధర్మకర్తలు సభ్యులను చేర్చే అవకాశం లభిస్తోంది. చట్టంలోని సెక్షన్ 151 ప్రకారం ఈ మార్పులు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. ఆలయాలను ప్రభుత్వం ఏ,బీ, సీ కేటగిరిలుగా వర్గీకరించనుంది.ప్రస్తుతం ఉన్న విధానంలో అత్యధిక ఆదాయం వచ్చే ఆలయాలను ఏ కేటగిరిలో ఉంచారు. చట్ట సవరణ ద్వారా 100 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వచ్చే ఆలయాలను ఏ కేటగిరి నుంచి తొలగించనున్నారు. టీటీడీ తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తారు. ట్రస్టు బోర్డులో 10 నుంచి 11 మంది సభ్యులతో పాటు ఐదుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు ఉండవచ్చు.ఆలయ అభివృద్ధికి అర్థవంతంగా సహకరించే వారి సామర్థ్యం ఆధారంగా ఛైర్మన్ తో సహా బోర్డు సభ్యులను నియమిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వసిస్తోంది. ప్రస్తుతం యాదాద్రి దేవాలయం వార్షిక ఆదాయం 230 కోట్లు, వేములవాడ దేవాలయం వార్షిక ఆదాయం 160 కోట్ల ఆదాయం ఉంది.2020 నంచి యాదాద్రి ఆదాయం 80 కోట్ల నుంచి గణనీయంగా పెరిగింది. బాసరలోని జ్ఞాన సరస్వతి దేవస్థానం, భద్రాచలం లోని సీతా రామచంద్ర స్వామి దేవస్థానం, కొండగట్టులోని ఆంజనేయ స్వామి దేవాలయం వంటి ఆలయాలు రూ.100 కోట్ల ఆదాయం కేటగిరీలో చేరనున్నాయని అంచనా.యాదగిరిగుట్టకు 2008లో ఏర్పడిన ధర్మకర్తల మండలి 2010 వరకు కొనసాగింది. 2010 నుంచి 2024 వరకు దాదాపుగా 14 ఏళ్లుగా పాలకమండలి లేకుండానే ఆలయం కొనసాగుతోంది.

## త్రివేణి సంగంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కూన పుణ్య స్నానాలు



హైదరాబాద్ : ప్రయాగ రాజ్ మహా కుంభమేళాలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ త్రివేణి సంగమంలో నేడు పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం వారు గంగమ్మకు ప్రత్యేక పూజలు , అర్చనలు చేయించారు. ఆ తర్వాత సమీపంలోని ఆలయాలను సందర్శించారు.. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజల సంక్షేమం కోసం పాటుపడేందుకు మరింత శక్తిని ప్రసాదించాలని ఆ దేవుడిని కోరుకున్నారు.

## రేవంత్ రెడ్డి చేతకానితనంతోనే నీళ్ల కరవు ...



హైదరాబాద్ : నీళ్లు ఉంటేనే పంటలు వేసుకోండన్న రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి వ్యాఖ్యలకు బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చాడు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. ముందుచూపు లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతకానితనం వల్ల వచ్చిన కరువు.. అసమర్థ కాంగ్రెస్ సర్కారు తెచ్చిన కరువు అంటూ చురకలు అంటించారు.తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును ఏడాదికాలంగా ఎండబెట్టి, రిజర్వాయర్లు పండబెట్టడం వల్లే రాష్ట్రంలో భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నది వాస్తవం అన్నారు.పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెరువులు, కుంటలు నిండుకుండలను తలపించేలా నిర్వహణ చేయడం వల్లే తెలంగాణ వ్యాప్తంగా ఏనాడూ భూగర్భజలాలు పడిపోలేదని వివరించారు. కానీ కాంగ్రెస్ సర్కారు చేతకానితనం వల్ల ఏడాది కాలంలోనే భూగర్భజలాలు పాతాళానికి పడిపోయి సమైక్యరాష్ట్రం నాటి దుస్థితి నెలకొందని గుర్తు చేశారు.రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ గా ఉంటూ ఉన్న వాస్తవాలు చెప్పాల్సింది పోయి.. వాటిని కప్పిపుచ్చి ఫిబ్రవరిలోనే ఎండలు ముదరడం వల్ల భూగర్భజలాలు పడిపోయాయనడం దారుణం అంటూ కొదండరెడ్డి పై ఫైర్ అయ్యారు కేటీఆర్.

## పన్ను కట్టలేదో.. సీజ్ చేస్తాం



హైదరాబాద్, ఆస్తి పన్ను కట్టని వారిని జీహెచ్ఎంసీ లక్ష్యంగా చేసుకున్నది. పన్ను కట్టని వారి ఆస్తులను సీజ్ చేస్తామంటూ బెదిరిస్తున్నది. ఇందులో భాగంగానే ప్రతిరోజూ ఒక్కో సర్కిల్‌లో ఐదేసి చొప్పున ఆస్తులను సీజ్ చేస్తున్నది. వచ్చే నెలాఖరులో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దరిమిలా జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లపై దూకుడు పెంచింది. చిన్నా, చితకా బకాయిదారుల నుంచి బడా వ్యక్తుల వరకు బకాయిదారుల చిట్టాను రూపొందించింది. సంస్థ ఖజానాను నింపుకోవడమే ఏకైక ఎజెండాగా కార్యాచరణను ప్రకటించింది.

### రెడ్ నోటీసులు జారీ

గత మూడు సంవత్సరాల పైబడి బకాయిలు పెండింగ్‌లో ఉండి పన్ను చెల్లించని వాళ్లకి వారెంట్స్ ఇష్యూ చేస్తున్నారు. ఇందులో భాగంగానే 6 లక్షల మంది బకాయిదారులకి రెడ్ నోటీసులు జారీ చేశారు. వీరి నుంచి రూ.400కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించాలని వారికి నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించిన వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ 269(2) కింద ఆస్తులను సీజ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి వరకు 80 ఆస్తులను సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా భవనాన్ని సీజ్ చేయగా.. సదరు యాజమాని స్పందించి శుక్రవారం ఆర్‌టీజీఎస్ ద్వారా జీహెచ్ఎంసీకి రూ. 51 లక్షల 50వేలను చెల్లించారు.

### రూ. 520 కోట్లే లక్ష్యం

ఆస్తిపన్ను బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. 30 సర్కిళ్లలో బకాయిదారులను చిట్టాను సిద్ధం చేసి వారికి రెడ్ నోటీసులు జారీ చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. రోజురోజుకు సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుండడం, ఈ ఆర్థిక సంవత్సరం రూ.2000కోట్ల నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు కేవలం రూ.1480కోట్ల మేర పన్నులు రావడంతో బకాయిదారులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. 19.25 లక్షల మందిలో 12 లక్షల మంది మాత్రమే ఆస్తిపన్ను చెల్లించారని, దాదాపు 6.75 లక్షల మందిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి రూ.520 కోట్లు రాబట్టాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సూపర్‌వైజరీ ఆఫీసర్లు రోజూ వారీగా వసూలైన ఓటీఎస్ కలెక్షన్లను పీటీఐఎన్ నంబరు, వచ్చిన కలెక్షన్ల వివరాలను ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోనున్నారు. ఆస్తిపన్ను చెల్లించాలని బకాయిదారులకు ఎస్ఎంఎస్‌లు పంపించనున్నారు.

### వారికి మాత్రం మొక్కుబడి నోటీసులు

జీహెచ్ఎంసీకి ఆస్తిపన్ను రూపంలో మొండి బకాయిలు మొత్తం దాదాపుగా రూ. 9800 కోట్ల మేర రావాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలదే కీలకం. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన 600 ఆస్తుల నుంచి రూ. 500 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉంది. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు 4వేల ప్రాపర్టీల నుంచి రూ. 5000కోట్ల బకాయిలు జీహెచ్ఎంసీ ఖజానాను చేరాల్సి ఉంది. అయితే సాధారణ నగరవాసుల విషయంలో ప్రాపర్టీల సీజ్ వరకు వెళుతున్న అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బకాయిల రాబడిలో మాత్రం తూతూ మంత్రంగా నోటీసులతో సరిపెడుతున్నారన్న విమర్శలు లేకపోలేదు.

## సంపాదకీయం

ఆదివారం 23-02-2025

# నేతల విద్యుత్ పాపాలు !

మసిపూసి మారేడుకాయ చందంగా ఇప్పుడు విద్యుత్ వ్యవస్థ తయారయ్యింది. పట్టణం, గ్రామాల్లో విద్యుత్ కోతలతో రైతులు, సామాన్య ప్రజానీకం నిత్యం కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అప్పుడే సమస్యలు తీరుతాయి. గత కెసిఆర్ ప్రభుత్వం నిరంతర విద్యుత్ పేరుతో ఊదరొగట్టింది. అప్పులు చేసి విద్యుత రంగాన్ని కుప్పచేసిన వారు ఇప్పుడు మొసలు కన్నీరు కారుస్తు న్నారు నిజానికి విద్యుత్ బిల్లులు,విద్యుత్ కోతలు ముందునుంచీ తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇరు తెలుగు రాష్ట్రాల్లో వివిధ విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయి. గతంలో ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోలేదు.లోపాలు బయటకు రాకుండా... లోపాల వార్తలను ప్రచురించ కుండా కట్టడి చేయించింది. ఇప్పుడేమో గతంలో అధికారంలో ఉన్న పార్టీ గగ్గోలు పెడుతున్నది. విద్యుత్ అందక ఆందోళనలు చేసిన రైతులు అప్పుడూ ఉన్నారు.. ఇప్పుడు కూడా ఉన్నారు. ఇప్పుడు అవే వార్తలను బలంగా ప్రచారం చేస్తున్న తీరు గత పాలకుల దుర్నీతిని తెలియ చేస్తోంది. తెలంగాణలో బెటర్‌మెంట్ ఛార్జీలతో షాక్‌లు ఇచ్చారు. విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచేశారు. ఇక ఎపిలో వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించడంతో పాటు..విద్యుత్ కోతలు ఆందోళనకు గురి చేస్తున్నాయి.. ఛార్జీల పెంపు ఇప్పటికే తడిసి మోపెడు చేశారు. తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పినా నష్టాలను తట్టుకోలేని విధంగా తయారు చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. వినియోగదారులకు దిమ్మతిరిగేల బిల్లులు వస్తున్నాయి. ఒక్కసారిగా వేల రూపాయల విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. కోలుకోలేని విధంగా విద్యుత్ చార్జీలు అప్పుడే పెంచేసారు.. విద్యుత్ వినియోగంలో పెరిగిన లోడ్‌కు సంబంధించి డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో సెక్యూరిటీ డిపాజిట్‌లు వసూలు చేయడం వంటివన్నీ చేసేశారు. దీనిని కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సవరించాల్సి ఉంది. కిలోవాట్ లోడ్ జీఎస్‌టీతో కలుపుకుని సుమారు రూ.1500 డెవలప్‌మెంట్ చార్జీలు వడ్డించినట్లు నాటి విద్యుత్‌శాఖ అధికారులు చెప్పారు. బాయిలకాడ మీటర్లు పెట్టమని చెబుతూ వచ్చిన కెసిఆర్..ఇలా గృహ వినియోగదారులపై ఎడాపెడా ఛార్జీలు వేసి ముక్కు పిండి వసూలు చేయించారు. ఘనత వహించిన పాలకుల కాలంలో వందల్లో వచ్చే బిల్లులు వేల రూపాయల్లో వచ్చాయి. వివిధ ఛార్జీల పేరుతో అదనపు బాదుడు సామాన్య, మధ్య తరగతి ప్రజలను షాక్‌కు గురిచేసాయి. వీటిని సవరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎపిలో కూడా జగన్ హయాంలో విద్యుత్ చార్జీల భారం మోపారు. వాటిని కూడా అధికారంలోకి వచ్చిన టిడిపి సవరించడం లేదు. ఇళ్లలో ప్రతినెల రూ.200 నుంచి రూ.500లోపు విద్యుత్ బిల్లులు వస్తుండేవి. డెవలప్‌మెంట్ చార్జీలు ఒక్కసారి మాత్రమే వస్తాయని అవి తప్పనిసరిగా కట్టాల్సి ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ భారం ఇప్పటికీ పడుతూనే ఉంది. ఇక ఎపిలో పరిస్థితి మరోలా ఉంది. పల్లెల్లో ఎప్పుడంటే అప్పుడు విద్యుత్ కట్ అవుతోంది. 9గంటల వ్యవసాయ విద్యుత్ అమలు కావడం లేదని రైతులు వాపోతున్నారు. విద్యుత్ కోసం రాత్రిళ్లు రైతులు పొలాల వద్ద పడిగాపులు పడుతున్నారు. లోడ్ పెరగడమే కారణం అంటున్న అధికారులు జిల్లాల్లో అనధికార విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ... ఎప్పుడు పోతుందో తెలియక ప్రజలు అల్లాడుతున్నారు. ముఖ్యంగా సమాచారం ఇచ్చేవారు లేకపోవడం తో విద్యుత్ మోటార్ల వద్ద రైతులకు కాలం గడుపుతున్నారు. వేసవి ప్రారంభం కాకుండానే ఇలా ఉంటే ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కాలం కావడంతో పట్టించుకునే వారు కరువయ్యారు. చిన్న పరిశ్రమలకూ విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో వరిసాగుకు నీరు అందటం లేదు. రాత్రిపూట ఫీడర్లు, సబ్‌స్టేషన్ల వారీగా కరెంటు ఇవ్వడంతో రైతులు వంతుల వారీగా రాత్రిపూటే పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇకపోతే గ్రామీణ ప్రాంతాల్లో అనధికార విద్యుత్ కోతలను అమలు చేశారు. ముఖ్యంగా విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిన సందర్భాల్లో గృహ విద్యుత్ వినియోగదారులకు సాయంత్రం, రాత్రి సమయాల్లో గంటనుంచి రెండుగంటల పాటు అనధికార కోతలు విధిస్తున్నారు. విద్యుత్ లోడ్ పెరిగిన సమయంలో అందుకు అనుగుణంగా డివిజన్ల వారీగా కోతలు విధిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ కోతలు మరింత పెరిగే అవకాశముందని అధికార వర్గాల సమాచారం. వ్యవసాయ సర్వీసులకూ గంటనుంచి రెండు గంటలపాటు అనధికార కోతలు అమలు చేస్తున్నారు. వ్యవసాయ అవసరాలకు పగటిపూట 9 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న ప్రభుత్వ ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండటం లేదని చెబుతున్నప్పటికీ చిన్నతరహా పరిశ్రమలకు కోతల బెడద తప్పటం లేదు. దీనితో రైతులకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. రబీలో మొక్కజొన్న, జొన్న పంటలూ అధికంగా సాగు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో 5గంటలకే కుదిస్తే ఎలాగని రైతులు మండిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో 5 గంటల నుంచి 8 గంటలపాటు విద్యుత్ కోత విధిస్తున్నారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. వ్యవసాయపంపు సెట్లకు ఉదయం 9గంటల విద్యుత్ సరఫరా చేయాల్సివుంది. అది సక్రమంగా అమలు కాకపోవడంతో మొక్కజొన్న, తెల్లజొన్న, అపరాల సాగుకు వ్యయ ప్రయాసలకోర్చి నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పట్టణ ప్రాతాల్లో రోజుమార్చి రోజు ఏదో ఒక ప్రాంతంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నారు. దీనితో ఐదు గంటలపాటు సరఫరా నిలిపివేస్తున్నారు. వేసవి ప్రారంభం ముందే కోతలు మొదలయ్యాయని ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# జగన్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని కోల్పోబోతున్నారా?

అమరావతి,"వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీ సభ్యత్వం రద్దవుతుంది. అసెంబ్లీకి రాకుండా ఇంట్లోనే కూర్చుంటే మేమే సభ్యత్వం తీసేస్తాం " ప్రస్తుతం ఏపీ స్పీకర్ తో పాటు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు చెబుతున్న మాటలు. తాను అసెంబ్లీకి వెళ్లేది లేదని, ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తానంటూ జగన్ పదేపదే చెబుతుండటంతో దానికి కౌంటర్ ఇస్తూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఇటీవల కొన్ని రోజులుగా జగన్ అనర్హత పై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా పులివెందులకు ఉప ఎన్నికలు తప్పవంటూ రఘురామ చెప్పడంతో పాటు ఆర్టికల్ 190(4)ను తెరమీదకు తేవడంతో అసలు ఏమిజరగబోతోంది? జగన్ కు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోగా అసెంబ్లీ నుంచే పంపేస్తారా? మిగిలిన 10మంది వైసీపీ సభ్యుల పరిస్థితి ఏంటన్న అనుమానాలు, దానికి తోడుగా విస్తృత చర్చలు సాగుతున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 190లోని అంశాలను ఉపయోగించుకొని జగన్ శాసనసభ్యత్వం రద్దుచేయాలని తెలుగుదేశం ప్రభుత్వం భావిస్తోంది. దాంతో అసలు ఆర్టికల్190ఏంటి? దానిలోని 4వ క్లాజ్ ఏమి చెబుతోంది? అనే ప్రశ్నలు ప్రస్తుతం ఆసక్తిగా మారాయి.

ఆర్టికల్ 190(4)ఏమి చెబుతోంది?

భారత రాజ్యాంగంలోని190 ఆర్టికల్ శాసన సభలలో సభ్యుల సెలవులు, సీట్ల కాళీ, ఏ పరిస్థితిలో స్పీకర్ సభ్యునిపై చర్యలు తీసుకోవచ్చు, అదే సభ్యుడిని ఏ నియమం ప్రకారం అనర్హుడిగా ప్రకటించవచ్చు అనే అంశాలను తెలుపుతోంది. ఇందులో ముఖ్యంగా ఆర్టికల్ 190లోని క్లాజ్ 4 పై సోషల్ మీడియా వేదికగా చర్చసాగుతోంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 190 (4) ప్రకారం 60 రోజుల పాటు ఒక రాష్ట్ర శాసన సభ సభ్యుడు (అనుమతి లేకుండా) అన్ని సమావేశాలకు గైర్హాజరైతే సభ అతని సీటు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించవచ్చు. అయితే అసెంబ్లీ జరిగిన 60 రోజులు సదరు సభ్యుడు కావాలని, ఎలాంటి కారణం లేకుండా, అదీ స్పీకర్ అనుమతి తీసుకోకుండా గైర్హాజరు కావాల్సి వుంటుంది.

జగన్ కు ఆర్టికల్190(4)కి సంబంధం ఏంటి?

ఇక అసలు విషయానికి వస్తే జగన్ అసెంబ్లీలోకి అడుగు పెట్టాలని నిజంగా అనుకోకపోతే ఆయన అసెంబ్లీ సీటును రద్దు చేయవచ్చా? ఆ అధికారం స్పీకర్ కు వుంటుందా? దీనిపై హైకోర్టు న్యాయవాది, రాజ్యాంగం పై రెండు పుస్తకాలు రాసిన హరిబాబు మాట్లాడుతూ అసెంబ్లీ జరిగిన 60 రోజుల పాటు గైర్హాజరయిన పక్షంలో స్పీకర్ కు ఆ అధికారం ఉంటుందన్నారు. అయితే దేశంలో ఈ ఒక్క క్లాజ్ తో ఏ ఒక్క సభ్యుడు తన సభ్యత్వాన్ని కోల్పోలేదని, అయితే సభ్యులు అసెంబ్లీకి రాకూడదని నిశ్చయించుకున్నా, అనర్హత పడకుండా, ఏదో ఒకరోజు వచ్చి సంతకం చేసి వెళుతుంటారని తెలిపారు. స్పీకర్లు కూడా ఈ విషయంలో పట్టుపట్టి చర్యలు తీసుకున్న ఉదాహరణలు లేవన్నారు.అయితే, ప్రతిపక్ష నాయకులు సుదీర్ఘకాలం పాటు వాకౌట్ చేయడం ఏపీ అసెంబ్లీలో ఒక ఆచారంగా వస్తోంది. కాబట్టి ప్రస్తుతానికి జగన్ పై అనర్హత వేటు పడుతుందని భావించడం కూడా అతిశయోక్తే అవుతుంది. అరవై రోజల పాటు ముందు అసెంబ్లీ జరగాలి. దానికి జగన్ స్పీకర్ అనుమతి లేకుండా గైర్హాజరు అయ్యే పరిస్థితులు ఉండవు. ప్రతిపక్ష హోదా ఇచ్చేదిలేదని ఏపీ స్పీకర్ తేల్చేశారు కాబట్టి సభకు జగన్ రారు, ఆర్టికల్ 190(4) ప్రకారం అనర్హుడిగా ప్రకటిస్తారన్నది ఇప్పుడు జరుగుతున్న ప్రచారం. ప్రస్తుతం స్పీకర్ గావున్న అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజులు ఆ అవకాశం జగన్ ఇస్తాడని, పులివెందులకు ఉప ఎన్నిక ఖాయమని ఆరాటపడుతున్నారు. తెలుగుదేశం శ్రేణులు జగన్ ను రెచ్చగొట్టి మరీ అసెంబ్లీకి రాకుండా చేయాలని ప్రయత్నిస్తున్నాయి. కాకుంటే వీరి గాలానికి జగన్ చిక్కుతారా? తానంతటతానే ఆ అవకాశం వాళ్లకు ఇస్తే తప్పించి పులివెందులకు ఉప ఎన్నిక వచ్చే అవకాశం లేదు.2019కి ముందు జగన్ పాదయాత్ర చేయడానికి అసెంబ్లీని వదిలి వెళ్ళినప్పుడు కూడా అలాగే చర్చ సాగింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు కూడా శాసనసభా సమావేశాలకు దూరం అయ్యారు. వైసీపీ ఎమ్మెల్యేలు తన కుటుంబం గురించి సభలో చెడుగా మాట్లాడిన తర్వాత చంద్రబాబు అసెంబ్లీ నుండి బయటకు వచ్చి తాను మళ్లీ ఎన్నికల్లో గెలిచి సభలో అడుగు పెడతానని శపథం చేసి సభలో అడుగుపెట్టలేదు. 2022 నుంచి 2024 ఎన్నికల వరకు చంద్రబాబు సభకు రాలేదు.కేవలం ఏపీలోనే కాదు అధికార పక్షం అవమానిస్తోందన్న కారణంగా ప్రతిపక్ష నేతలే అసెంబ్లీకి పోని సంఘటనలు తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాజకీయాలలోను జరిగాయి.1989 మార్చి 25న ప్రతిపక్ష నేతగా ఉన్న జయలలితకు నిండు



సభలో పరాభవం జరిగింది. దాంతో డిఎంకె అధినేత కరుణానిధి, ఆమె బద్ధ శత్రువులుగా మారారు. జయ అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధిని తీవ్రంగా విమర్శించారు. అది భరించలేని కొందరు డీఎంకే సభ్యులు ఆమెపై చేయి చేసుకున్నారు. మరికొందరు కొంగుపట్టుకుని లాగారు. దాంతో ఆమె అగ్గి మీద గుగ్గిలం అయ్యారు. కరుణానిధిని ఓడించే వరకు అసెంబ్లీలో అడుగుపెట్టనంటూ శపథం చేశారు. ఆ ప్రకారమే 1991లో విజయం సాధించి ముఖ్యమంత్రి అయిన తర్వాతనే సభలో అడుగుపెట్టారు.అటు 1972 ఎన్నికలలో పశ్చిమ బెంగాల్ లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన తరువాత అదంతా రిగ్గింగ్ వల్లే జరిగిందని సీపీఎం తీవ్ర ఆరోపణలు చేసింది. అప్పట్లో ప్రతిపక్ష నేతగా వున్న సీపీఎం సీనియర్ నేత జ్యోతిబసు ఫలితాలను అంగీకరించడానికి నిరాకరించి కొత్త అసెంబ్లీని "మోసాల సమావేశం" అని ప్రకటించారు. హింసాత్మక సంఘటనలను "సెమీ ఫాసిస్ట్ టెర్రర్"గా అభివర్ణిస్తూ ఆయన "వరల్డ్ ప్రెస్"కు బహిరంగ సంపాదకీయాన్ని కూడా ప్రచురించారు. "భారీ రిగ్గింగ్" జరిగిందనే వైఖరిని తీసుకుని సిపిఐ-ఎం ఏడవ అసెంబ్లీలో మిగిలిన కాలానికి అసెంబ్లీని బహిష్కరించింది. ఈ చర్య అప్పట్లో వార్తలకెక్కింది. అప్పట్లో ముఖ్యమంత్రిగా వున్న సిధార్థ్ శంకర్ రాయ్ తీరును జ్యోతిబసు తప్పుపట్టి అసెంబ్లీ సమావేశాలనే బహిష్కరించారు. ఇలా సీనియర్ రాజకీయ ఉద్దండులే అసెంబ్లీ సమావేశాలకు వెళ్ళని ఉదంతాలు వున్నాయి. ప్రస్తుతం కెసిఆర్ కూడా అసెంబ్లీకి దూరంగానే ఉన్నారు. అధికారులు కోల్పోయిన తర్వాత ముఖ్యంగా పార్టీ అధినేతలు ఇలా అసెంబ్లీని బహిష్కరించడం సాధారణ అంశంగా మారుతుంది.

జగన్ గైర్హాజరును లైట్ గా చూడాలా

%ఇదంతా లైట్ గా తీసుకోవాలని మీడియా ముందు మాట్లాడడానికే రాజ్యాంగంలోని ఆర్టికల్స్ ను వాడుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 190 (4) ఏదైనా రాష్ట్ర శాసనసభలోని సభ్యుడు 60 రోజులపాటు సభ అనుమతి లేకుండా అన్ని సమావేశాలకు గైర్హాజరైతే సభ ఆ ప్రతినిధి సీటు ఖాళీ అయినట్టు ప్రకటించవచ్చని తెలుపుతోంది.కానీ, ఆ 60 రోజుల కాలాన్ని లెక్కించేటప్పుడు సభ వరుసగా నాలుగు రోజులకు మించి వాయిదా పడిన కాలాన్ని ప్రోరోగ్ అయిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోకూడదని తెలియజేసింది.అయితే, రాజ్యాంగం కల్పించిన 60 రోజుల నిబంధనే రాజకీయ నేతలకు అవకాశం ఇస్తోంది.అసెంబ్లీ సమావేశాలు ఐదేళ్లలో కనీసం 150 రోజులు కూడా జరగని సందర్భాలే ఎక్కువ ఉంటాయి. గతంలో లాగా అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు నిర్వహించడం లేదు.1952లో హైదరాబాద్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఒక్క ఏడాదిలోనే 74 రోజులు సమావేశమైంది.2014-2019 మధ్య ఐదేళ్ల కాల వ్యవధిలో అసెంబ్లీ సమావేశాలు129 రోజులు జరిగాయి. 2019- 2024 మధ్య వైసీపీ హయాంలో 79 రోజులు సభ నడిచింది. గట్టిగా ఏడాదికి 15 రోజులు కూడా అసెంబ్లీ సమావేశాలు జరగడం లేదు. ప్రస్తుత సమావేశాల తీరును గమనిస్తే అరవై రోజులు సభ జరగాలంటే 3- 4 సంవత్సరాలు పడుతుంది. ఎన్నికల ఏడాది హడావుడి మొదలౌతుంది. అప్పుడు ఫలానా సభ్యుని సీట్ ఖాళీ అయిందని ప్రకటించినా ఉపయోగంలేదు.ఏది ఏమైనా ఇప్పుడు జగన్ కు ప్రతిపక్ష హోదా దక్కే అవకాశం లేదు. జగన్ కూడా మొండిగా అసెంబ్లీకి గైర్హాజరు కావడం కూడా ఖాయంగా కనిపిస్తుంది. మరి కావాలనే జగన్ గీత దాటతారో స్పీకర్ కు ఆ అవకాశం ఇస్తారో లేదో వేచి చూడాలి. ఏదైనా రాజ్యాంగం ప్రకారమే అంతా నడుస్తోందని చెప్పే నీతికబుర్లు వినడానికి బాగుంటాయిగాని ఆచరణలో సాధ్యమా చూడాలి మరి.

# పాఠశాల విద్య బలోపేతంకే స్కూల్ కాంప్లెక్సులు



హైదరాబాద్,విద్యా వేత్త కొఠారి కమిషన్ నివేదిక మేరకు 2004 నుండి స్కూల్ కాంప్లెక్స్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం దీంట్లో కాస్త మార్పులు చేర్పులు చేస్తూ రాష్ట్ర విద్యా శాఖ ఒంటి పూట కాంప్లెక్స్‌లుగా మార్చి 2025 ఫిబ్రవరి 15 నుండి అమల్లోకి తెచ్చింది.

గత విధానంలో

ఒక ఉన్నత పాఠశాల కేంద్రంగా ఉన్న 10 లేదా 15 ప్రాథమిక పాఠశాలల కూర్పుతో స్కూల్ కాంప్లెక్స్ తయారవుతుంది. కేంద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాంప్లెక్స్ చైర్మన్‌గా పరిధిలోని ఉపాధ్యాయులు అందరూ సభ్యులుగా ఉంటారు. విద్యా సంబంధ ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా అనుసంధానం చేసుకొని మాస వారీ సమావేశాల్లో ప్రత్యేక ప్రణాళికలు రూపుదిద్దే వేదికలుగా కాంప్లెక్స్ ఉంటాయి. ఉమ్మడి ఏపీలో ఈ విధానం ప్రారంభించారు. 93 ఉత్తర్వు ప్రకారం కాంప్లెక్స్ పరిధిలో హ్యాబిటేషన్లు 3 వరకు ఉంటే ఒక కోఆర్డినేటర్, అంతకంటే ఎక్కువ ఉంటే ఇద్దరు కో ఆర్డినేటర్లను నియమించాలని ఉంది. వీరు విద్యాసంబంధ సమాచార సేకరణ అనుసంధానకర్తలుగా పని చేస్తారు. కానీ పూర్తిస్థాయిలో స్కూల్ కాంప్లెక్స్ విధానం అమలకు నోచుకున్న సందర్భంలో కాంప్లెక్స్ కు ఒకరిని మాత్రమే క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గా నియమించారు. అప్పటినుండి ఇప్పటివరకు సిఆర్‌పిల ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ వ్యవస్థ బలిష్టంగా మారింది.

ప్రస్తుత విధానంలో..

ప్రతి మూడవ శనివారం మధ్యాహ్నాం ఒంటిగంట నుండి ఐదు గంటల వరకు స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశాలు నిర్వహించాలంటూ ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో 15 ఫిబ్రవరి 2025 నుండి ఒంటిపూట స్కూల్ కాంప్లెక్స్ విధానం అమలులోకి వచ్చింది. ఏ ఉపాధ్యాయుడు గైర్హాజరు కాకుండా రాష్ట్ర విద్యా శాఖ నిర్దేశించింది. ప్రాథమిక ఉపాధ్యాయులకు, సెకండరీ ఉపాధ్యాయులకు వేర్వేరు అజెండాలు ఉంటాయి. 1,2 తరగతుల ఉపాధ్యాయులకు 3,4,5 తరగతుల ఉపాధ్యాయులకు వేరువేరుగా రిసోర్స్ పర్సన్‌లను నియమించి వేరువేరు సమావేశాలు చేపడతారు. సెకండరీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏడు రకాల సబ్జెక్టుల టీచర్లను వర్గీకరణ చేసి సమావేశాలు నిర్వహణ ఉంటుంది. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో కాంప్లెక్స్‌ల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో ఉన్న దాదాపు 4 వేల స్కూల్ కాంప్లెక్స్‌లను కుదించి 2809 క్లస్టర్ కాంప్లెక్స్‌లుగా మార్చారు. 25 నుంచి 30 ప్రాథమిక పాఠశాలలను కొత్త కాంప్లెక్స్‌లకు అనుసంధానం చేశారు. అర్బన్ కేంద్రాలకు మాత్రమే పూర్తి స్థాయి ప్రాధాన్యత ఇచ్చారు.

మార్పులు అవసరం

అయితే, ఏ ఒక్క స్కూల్ కాంప్లెక్స్‌నూ రద్దు చేయకుండా ప్రస్తుతం నడుస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌లకు ప్రత్యామ్నాయంగా స్కూల్ కమ్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలి. కొఠారి కమిటీ, రామ్మూర్తి కమిటీల అభిప్రాయాలను సమ్మేళనం చేసి స్కూల్ కమ్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి. అంటే ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలకు అనుసంధానం చేసి మినీ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు, 3 లేదా 4 మినీ స్కూల్ కాంప్లెక్స్‌లను ఉన్నత పాఠశాలలకు అనుసంధానం చేసి మిడిల్ స్కూల్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయాలి. తర్వాత 4 లేదా 5 మిడిల్ స్కూల్ కాంప్లెక్స్‌లను ఒక కళాశాలకు అనుసంధానం చేసి ఎడ్యుకేషన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసి ఆయా సంస్థల మధ్య విద్యా కార్యకలాపాలు జరిపేటట్లు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. దీంతో శాస్త్రీయ విద్యా విధానంపై చర్చించుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా సబ్జెక్టు బోధన విధానంలో ఉన్న అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవచ్చు. దీన్ని ప్రభుత్వం పరిశీలించి అమలు పరిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయి.

విద్యార్థులు ప్రైవేట్‌కు మళ్లే ప్రమాదం

ప్రస్తుత విధానంతో పలు సమస్యలు ఏర్పడుతున్నాయి. కేవలం ఒకపూట పాఠశాల నిర్వహించి పిల్లలను ఇళ్లకు పంపడం వలన పిల్లలకు ప్రమాదాలు తలెత్తే అవకాశం వుంది. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు సెలవు వుండి ప్రైవేట్ పాఠశాలలు పనిదినంగా ఉండటం వలన తల్లిదండ్రులలో ప్రభుత్వ పాఠశాలలపై తప్పుడు భావన కలుగుతుంది.

# పత్తి రైతులను నిండా ముంచిన అధికారులు

హైదరాబాద్,పంట ఏదైనా రైతులు చిత్తవుతున్నారు. పంటలు దండిగి పండించినా గిట్టుబాటు ధరలు లేకపోవడం, మోసపోవడం ఏటా షరామామూలుగా మారింది. ప్రధానంగా మార్కెట్ కమిటీలు, ఉత్సవ విగ్రహాల్లా మారాయి. రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన మార్కెటింగ్ అధికారులు, దళారులతో కుమ్మక్కవుతున్నారు. లేని రైతుల పేరుతో టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులనే బురిడీ కొట్టిస్తున్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు పత్తిని కొని ఎక్కువ రేటుకు అమ్ముకొని కోట్లు వెనకేసుకున్నారు. ఈ క్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీలకు భారీ మొత్తంలో ముట్టజెప్పారు. కొందరు సీసీఐ అధికారులు, రైతుసంఘాల నుంచి ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు ఎంక్వైరీ చేయగా, అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ఏడుగురు మార్కెట్ సెక్రటరీలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ కావడం రెండు శాఖల్లో సంచలనం సృష్టించింది.టీఆర్ పత్రాలు చేతిలో ఉండడంతో మార్కెట్ కార్యదర్శులు, దళారులతో కలిసి అక్రమాలకు తెరలేపారు. పత్తి రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొన్న దళారులు పత్తి క్వాలిటీ లేదని, గింజ పొడవు లేదని, మాయిశ్చర్ రావడం లేదని రకరకాల సాకులు చెప్పి క్వింటాల్ రూ.5 వేలు, ఆలోపే కొని సీసీఐకి రూ.7,121 చొప్పున అమ్ముకున్నారు. ఈక్రమంలో ఒక్కో క్వింటాల్‌కు రూ.2 వేల చొప్పున కోట్లు వెనకేసుకొని.. మార్కెట్ కార్యదర్శులకు కమిషన్ కింద లక్షల్లో ముట్టజెప్పారు. టీఆర్ పత్రాలపై పదే పదే అవే పట్టాదారు పాస్‌బుక్ నంబర్లు వేస్తే దొరికి పోయే ప్రమాదం ఉండడంతో ఏజెన్సీలోని పోడు, పట్టాబుక్‌లు లేని ఇతర భూముల్లో పత్తి పండించినట్టు చూపిస్తూ.. దందా కొనసాగించారు. ముఖ్యంగా ఏజెన్సీ భూములు ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెట్ల పరిధిలో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా జరిగినట్టు మార్కెటింగ్?శాఖ అధికారులు గుర్తించారు. రైతులు సీసీఐ ఏర్పాటుచేసిన కేంద్రాల్లో పత్తిని విక్రయించాలంటే ముందుగా ఆయా మండలాల్లోని వ్యవసాయ అధికారుల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఇందుకు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లి.. తాను ఈ సీజన్‌లో ఎన్ని ఎకరాల్లో పత్తి సాగుచేస్తున్నది, ఎంత దిగుబడి వస్తున్నది వివరించాలి. దీనిని ధ్రువీకరించుకున్నాక సంబంధిత ఏఈవో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. అనంతరం సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్ముకునే ముందు సంబంధిత ఏఈవో దగ్గరికి వెళ్తే రిజిస్ట్రేషన్? పత్రాలను ఇస్తారు. వాటిని మార్కెట్‌కు తెస్తేనే సీసీఐ అధికారులు కొనుగోలు చేస్తారు. కానీ ఈ విషయం తెలియని రైతులు నేరుగా సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకొస్తున్నారు. ఇలాంటి వారు వేల మంది ఉండడంతో వీరికి టెంపరరీ రిజిస్ట్రేషన్( పత్రాలు జారీ చేసే అధికారాన్ని మార్కెట్ సెక్రటరీలకు మార్కెటింగ్‌శాఖ అప్పగించింది. ఇది దళారులకు వరంగా మారింది. టీఆర్ అక్రమాలపై సీసీఐ అధికారులతోపాటు కొందరు రైతు సంఘాల నేతలు ఫిర్యాదు చేయడంతో మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఆదిలాబాద్, చెన్నూర్, పెద్దపల్లి, వరంగల్, జనగామ, భద్రాచలం, సిద్దిపేట జిల్లాల్లో విచారణ చేశారు. ఆయా చోట్ల సీసీఐ కొనుగోళ్ల కోసం జారీ చేసిన టెంపరరీ రిజిస్ట్రేషన్‌లో తేడాలను గుర్తించి నివేదిక పంపించారు. దీంతో ఆయా జిల్లాల్లో సెక్రటీరీలపై వేటు పడింది. ఆఫీసర్ల పాత్రపైనా ఆ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసినట్టు తెలిసింది. మార్కెటింగ్‌శాఖ అధికారులు ఇచ్చిన ఆధారాలతో ఆయా చోట్ల పలువురు ఏఈవోలపైనా వేటు పడవచ్చనే చర్చ జరుగుతున్నది.

# శివుడికి పంచామృత అభిషేకకం శ్రేష్ఠం

శ్రీశైలం,పరమశివునికి అత్యంత పవిత్రమైన పండుగలలో శివరాత్రి ప్రధానమైనది. ఈ పండుగ భక్తులకు ఎంతో విశిష్టమైనది. ఈ పర్వదినాన శివుని ఆరాధించడం, శివలింగానికి పూజలు చేయడం ఎంతో పుణ్యప్రదమని నమ్ముతారు. ఈ సమయంలో శివలింగానికి అనేక పదార్థాలు సమర్పిస్తారు. వాటిలో పాలు ముఖ్యమైనవి. కొన్ని ప్రాంతాలలో పంచామృతంతో అభిషేకం చేస్తారు. పంచామృతం అంటే పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర కలిపిన మిశ్రమం. మహాశివరాత్రి పూజలో భక్తి, శ్రద్ధ ముఖ్యమైనవి. శివునికి ప్రీతికరమైన పదార్థాలను సమర్పించి ఆయనను ప్రార్థించడం వల్ల మనోభీష్టాలు నెరవేరుతాయి. రాగి చెంబులో పాలు పోయకూడదనే నియమం గురించి తెలుసుకొని దానికి అనుగుణంగా పూజ చేయడం మంచిది. భక్తితో శివుని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం. ఏదైనా సందేహం ఉంటే పూజారులు లేదా పెద్దల సలహా తీసుకోవడం మంచిది. అయితే రాగి చెంబులో పాలు పోసి శివలింగానికి సమర్పించకూడదని శాస్త్రాలు చెబుతున్నాయి.పాలు వస్తువులలోని నెగటివ్ ఎనర్జీని తొలగిస్తాయని నమ్మకం. అలాగే పాలు దాదాపు ప్రతి పూజలోనూ ఉపయోగిస్తారు. పాలు స్వచ్ఛతకు, పవిత్రతకు చిహ్నంగా భావిస్తారు. రాగి ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ రాగికి కొన్ని పరిమితులు ఉన్నాయి. కొన్ని పదార్థాలతో రాగి చర్య జరుపుతుంది. పాలు ఏ వస్తువు నుండైనా నెగటివ్ ఎనర్జీని గ్రహిస్తాయి. రాగి చెంబు చుట్టూ ఏదైనా అశుద్ధం ఉంటే రాగి చెంబులో పాలు పోసినప్పుడు ఆ అశుద్ధం పాలతో కలిసిపోతుంది. దీనివల్ల పాలు అపవిత్రమవుతాయి. అలాంటి పాలను శివలింగానికి సమర్పించడం మంచిది కాదు. శివునికి సమర్పించే పాలు స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండాలి. అందుకే రాగి చెంబులో పాలు పోసి శివలింగానికి సమర్పించకూడదు. హాశివరాత్రి రోజున శివుడిని భక్తితో పూజించడం వల్ల ఆయన అనుగ్రహం పొందవచ్చు. శివలింగానికి స్వచ్ఛమైన పాలతో అభిషేకం చేయడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. అయితే రాగి చెంబులో పాలు పోసి అభిషేకం చేయకూడదు. వేరే లోహపు పాత్రలో అంటే వెండి లేదా మట్టి పాత్రలో పాలు పోసి శివలింగానికి సమర్పించవచ్చు.

హైడ్రాను మరింత పటిష్టం చేయాలి

## భూ కబ్జాదారుల ఆటకట్టిస్తున్న హైడ్రా

హైదరాబాద్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాను మరింత పటిష్టం చేయాలని పలువురు భూ కబ్జాదారుల బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కబ్జాదారుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలకు హైడ్రా పరిష్కారం చూపుతోందన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరం, శివారు ప్రాంతాలకు చెందిన బాధితులు నాగేశ్వరరావు, సాయికుమార్, చంద్రశేఖర్, తనూజ, శ్రీనాథ్, గాయత్రి, నవీన్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా వంటి మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిందని, కబ్జాదారుల బారి నుంచి తమను రక్షిస్తుందని చెప్పారు. కొంత మంది కబ్జాదారులు హైడ్రాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హైడ్రా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని చెప్పారు. పార్కులు, చెరువులు, ప్రభుత్వ స్థలాను కబ్జా చేస్తున్న వారిపై ఫిర్యాదు చేసిన బాధితులపై కక్షపూరిత కేసులు నమోదు చేస్తున్నారని, సీఎం స్పందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ మేరకు తమకు హైడ్రా చేసిన మేలును, కబ్జాదారులు వేధిస్తున్న వివరాలను పలువురు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దివ్యనగర్, కోహెడ, అమీన్‌పూర్, నాగిరెడ్డి చెరువు, ముత్తంగి, బడంగ్ పేట్ తదితర ప్రాంతాల్లో హైడ్రా వల్ల లబ్ధిపొందిన వారు పాల్గొన్నారు.

# దేశంలో సమస్యలపై కానరాని చిత్తశుద్ధి..పరిష్కరించే చొరవ చూపని మోడీ



న్యూఢిల్లీ,దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు దిగి రావడంలేదు. ద్రవ్యోల్బణం అదుపు కావడం లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని కాంక్షించిన ప్రజలు మూడోమారు నరేంద్రమోడీకి అధికారం అప్పగించారు. కానీ జరుగుతున్న దేమిటి..? ప్రజల ధన, మాన, ప్రాణాలకే రక్షణ కరువైపోయింది. దేశంలో అత్యాచారాలు, అరాచకాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. దేశంలో ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హవా నడుస్తోంది! ఆయన వ్యూహాల ముందు మిగతా పార్టీల వ్యూహాలు చెల్లకుండా పోతున్నాయి. తనకు తిరుగు లేదనే భావనతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఎన్నిక ఏదైనా గెలుపు తమదేనని అంటున్నారు. ప్రజల సమస్యలపై నేరుగా చర్చించే అవకాశం లేకుండా చేస్తున్నారు. పార్టీలో దీనిపై చర్చ జరగడం లేదు. దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకునే వీలు లేకుండా పోయింది. విదేశీ పర్యటనలకు ఇస్తున్న ప్రాధాన్యం దేశంలో సమస్యలు తెలుసుకోవడానికి ఇవ్వడం లేదు. సమస్యలను పరిష్కరించ గలిగామని, వాటిని అధిగమించామని భావిస్తున్నారు. అదేరీతిలో ప్రజలను నమ్మించడానికి ప్రధాని నరేంద్రమోడీ గత పదేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. అందుకే ధరల పెరుగుదల, నిరుద్యోగం, జీఎస్టీ వంటి విషయాలను పార్లమెంటులో ప్రస్తావించి చర్చించే ధైర్యం నేటికీ చేయడంలేదు. వాటివల్ల కలిగిన నష్టాలను పూడ్చే ప్రయత్నం కూడా చేయడం లేదు. ఎవరూ ప్రశ్నించడానికి వీలుకాని భారీ బహిరంగసభల్లో మాత్రం అనర్గళంగా మాట్లాడుతూ విపక్షాలను దుమ్మెత్తి పోస్తుంటారు. అలాగే పార్లమెంటులో కూడా తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శిస్తుంటారు. ఇతర దేశాల అగ్రనేతల ఆలింగనాల్లో సేదతీరుతున్న ప్రధాని మోడీకి దేశంలోని సమస్యలు అస్సలు కనిపించడం లేదు. సొంతపార్టీ నేతల చప్పట్లకు అలవాటు పడిన మోడీకి దేశంలోని ప్రజల ఇక్కట్లు వినిపించకపోవచ్చు. అందుకే సమస్యలు పరిష్కారం కాక ప్రజల్లో అసహనం రాజ్యమేలుతోంది. తాము కోరుకున్నదేమిటి? దేశంలో జరుగుతున్న దేమిటి? అనే ప్రశ్న క్రమేణా బలపడుతోంది. అభివృద్ధి పేరుతో, పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రధాని దేశాటనలు చేస్తూ దేశ సమస్యలను మాత్రం నడిబజారులో వదిలారు. రైతుల ఆత్మహత్యలు – ఆక్రందనలు, కార్మికుల ఆందోళనలు పట్టించుకోవడం లేదు. నల్లధనంపై పోరాటంలో తాము రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకున్నామని అంటున్నారు. దేశంలో నల్లధనాన్ని, అవినీతిని నిర్మూలించడానికి పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని మోదీ పదేపదే చెప్పుకొచ్చారు. ఈ చర్య సత్ఫలితాలు ఇచ్చిందో లేదో మాత్రం చెప్పడం లేదు. నగదు రహిత లావాదేవీల నినాదం కూడా తెరవెనుకకు వెళ్లింది. ప్రజలకు సంబంధించిన విషయాలకన్నా ప్రభుత్వాన్ని నిలబెట్టుకునే ఆలోచనలే మోడీ ముందు ఎక్కువగా ఉంటాయి.

# కలవరం సృష్టిస్తున్న జిబిఎస్ వ్యాధి



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో జిబిఎస్ వ్యాధి కలవరం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు జీబీఎస్ కేసులతో ముగ్గురు మృతి చెందారు. ప్రస్తుతం కర్నూలులో మరో కేసు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. మరణాలు, కేసులు పెరుగుతుండడంతో ఆందోళన పెరుగుతోంది. మహారాష్ట్ర, తెలంగాణలో విజృంభించిన జీబీఎస్ వ్యాధి ఇప్పుడు ఏపీలో చాప కింద నీరులా వ్యాపిస్తోంది. కేసులు క్రమక్రమంగా పెరుగుతుండడంతో ఆందోళన నెలకొంది. మరోవైపు ప్రభుత్వం కూడా గట్టి చర్యలు చేపట్టింది. ఇంకోవైపు గుంటూరు జీజీహెచ్‌లో నలుగురు చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు జీజీహెచ్‌లో ఇద్దరు మృతి చెందారు. అంతకుముందు ప్రకాశం జిల్లా అలసందలపల్లికి చెందిన కమలమ్మ జీబీఎస్‌తో గుంటూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. దీంతో మొత్తంగా ఏపీలో ఇప్పటి వరకు మూడు మరణాలు నమోదయ్యాయి. అయితే ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారులు, వైద్యులు చెబుతున్నా.. కేసులు నమోదుకావడం, మరణాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లా వాసులను ఈ కొత్త వైరస్ వణికిస్తోంది. మొన్నటి వరకు మహారాష్ట్ర, తెలంగాణల్లో కలకలం రేపిన గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) ప్రస్తుతం రాష్ట్రంలో కూడా చాపకింద నీరులా వ్యాపించింది. జీబీఎస్ లక్షణాలతో 44 ఏళ్ల మహిళ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆరు రోజుల క్రితం తీవ్ర జ్వరం, కాళ్ల నొప్పులతో బాధపడుతూ అడ్మిట్ అయింది. రోగికి పరీక్షలు నిర్వహించగా.. జీబీఎస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కావడంతో మహిళను ఏఎంసీ వార్డులో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ కేసుతో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అప్రమత్తమయ్యారు. జీబీఎస్ వ్యాధి నివారణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి కలుషిత ఆహారం వల్ల సోకుతుందని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జీజీహెచ్‌లో చికిత్సకు అవసరమైన ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గులియన్‌బారే సిండ్రోమ్‌కు నోడల్ ఆఫీసర్‌గా మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దమం శ్రీనివాసులును నియమించారు. ఈ సమావేశంలో సీఎస్ఆర్ఎంవో బి.వెంకటేశ్వర్లు, న్యూరాలజి హెచ్ఓడీ సి.శ్రీనివాసులు, మెడిసిన్ హెచ్ఓడీ ఇక్బాల్ హుశేన్, పీడీయాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. జీబీఎస్ వ్యాధి నివారణ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు మందులు అందుబాటులో ఉంచామని, ప్రత్యేకంగా వైద్యులతో నోడల్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇది అంటువ్యాధి కాదని, ప్రజలు ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని అయన అన్నారు.

# ఆక్రమణ చెరలో దేవాలయ భూములు

నల్లగొండ, జిల్లాలో అనేక దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయి. కౌలుకు తీసుకున్న వారు కూడా చెల్లించడంలేదు. అలాగే అధికారులు కూడా గట్టిగా చర్యలు తీసుకోవడం లేదు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా దేవాలయ భూములపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇంత జరుగుతన్నా దేవాదాయ శాఖ అధికారుల దృష్టి పెట్టడం లేదు. సర్వే నంబర్లు మార్చి రైతుబంధు సహా అనేక పథకాలు పొందారు. దేవాదాయ భూముల పక్కనే ఉన్న సర్వే నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతుబంధు పథకం కూడా పొందారు. భూములను స్వాధీనంచేస్తే ఆయా దేవాలయాల్లో దూప, దీప నైవేద్యాలతో పాటు మహోత్సవాలను నిర్వహించేందుకు అవకాశం లభిస్తుందని పూజారులు ఆశపడుతున్నారు. ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయం పరిధిలో 654 ఎకరాల భూమి ఉంది. ముందుగా కౌలుకు చేశారు. ఆ తర్వాత కౌలు చెల్లించడం మానేశారు. ఏకంగా పక్కా భూముల సర్వే నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దేవాలయం మొత్తం శిథిలావస్థకు చేరింది. అక్కడ దేవాలయ భూములను పరిరక్షించే వారు కరువయ్యారు. అర్వపల్లి మండల కేంద్రంలోని యోగానంద లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయం పరిధిలో 750 ఎకరాల భూమి ఉండగా 650 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని సేద్యం చేస్తున్నారు. సంవత్సరానికి రూ.500 మాత్రమే చెల్లించి కౌలు చేస్తున్నారు. మరో 100 ఎకరాలు అక్రమణకు గురయ్యాయి. ఎంతోమంది ఇళ్లు కట్టుకొని నివాసముం టున్నారు. రిజిస్ట్రేషన్లు కూడా మారిపోయాయి. మోతె మండలం ఉంద్రుగొండ లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయం కింద 100కు పైగా ఎకరాలు ఉండేది. కౌలుకు తీసుకున్న వారు ఏకంగా ఆక్రమించుకున్నారు. మద్దిరాల మండలం గోరెంట్ల వేంకటేశ్వరస్వామి, శివాలయాల కింద 150 ఎకరాల భూమి ఉంటే సుమారు 30 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. నాగారం మండలంలోని ఫణిగిరి లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయం, శ్రీరామ ఆలయానికి సంబంధించిన భూముల ను కూడా పట్టాలు చేసుకున్నట్లు సమాచారం. చివ్వెంల మండలం దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి గుడి కింద 26 ఎకరాల దేవాలయ భూమి ఉండగా 15 గుంటలు సబ్‌స్టేషన్ నిర్మాణానికి అందజేశారు. అది పోనూ మిగిలిన భూమిలో 5 ఎకరాల దాకా



అన్యాక్రాంతమైనట్లు తెలుస్తుంది. చివ్వెంల మండలం ఉంద్రుగొండ ఫారెస్టు భూమి 2వేల ఎకరాలకు పైగా ఉండగా 100 ఎకరాల దాకా చుట్టు పక్కలా వారు అక్రమించు కున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని నాగులపహాడ్ త్రికుటేశ్వర దేవాలయం కింద 4 ఎకరాల భూమి ఉండాల్సి ఉంది. కేవలం ఎకరం మాత్రమే ఉంది. పక్కారైతులు అక్రమించుకొని పట్టాలు చేయించు కున్నారు. హుజుర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయం పరిధిలో 650 ఎకరాలుంటే 350 మంది రైతులు సేద్యం చేస్తున్నారు. ఎకరానికి రైతులు రూ.3వేలు కౌలు చెల్లిస్తున్నారు. దీనిలో కూడా 100 ఎకరాలు అన్యాక్రాంత మైనట్లు తెలుస్తుంది. మోతె మండలంలోని ఉర్లుగొండ లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయం పరిధిలో 80 ఎకరాల భూమి ఉండాలి. 15 ఎకరాల భూమి అన్యాక్రాంత మైంది. ఎస్సారెస్పీ కాల్వల కింద 6 ఎకరాల భూమి పోయింది. కౌలు కూడా కొంత మంది చెల్లించడం లేదని తెలుస్తుంది. అయితే వరుసగా విమర్శలు రావడంతో దేవాదాయ శాఖ ఇప్పుడిప్పుడే మేల్కొంటుంది. కబ్జాకు గురైన భూములను సంరక్షించు కోవాలని రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు చేపట్టింది. దేవాలయాల సమిపంలో భూముల సర్వే నెంబర్లు బోర్డులపై రాసే కార్యక్రమం కొనసాగుతుంది. అక్రమించుకున్న వారు భూములను ఇవ్వకుంటే ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టుల్లో కేసులు నమోదు చేయాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారు.

# బ్రిక్స్ దేశాలపై మరోసారి నోరుపారేసుకున్న ట్రంప్



వాషింగ్టన్, 'బ్రిక్స్' దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతకొంతకాలంగా గుర్రుగా ఉన్న విషయం తెలిసిందే. దేశాల పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఈ విధంగానే ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా అమెరికన్ డాలర్ (డాలర్) స్థానంలో వేరే కరెన్సీ తెచ్చేందుకు ప్రయత్నిస్తే 150 శాతం సుంకాన్ని (టారిఫ్) విధిస్తామని పలుసార్లు చెప్పారు. తెలియజేసారు. తాజాగా బ్రిక్స్ దేశాలపై మరోసారి ఆయన నోరు పారేసుకున్నారు. సుంకాలు విధిస్తామనగానే బ్రిక్స్ చెల్లాచెదురైపోయిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.'బ్రిక్స్ దేశాలు డాలర్‌ను నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అందుకు ప్రత్యామ్నాయంగా కొత్త కరెన్సీని సృష్టించాలనుకున్నారు. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే బ్రిక్స్‌పై 150 శాతం సుంకాలు విధిస్తానని నేను చెప్పగానే అందులోని దేశాలు పరస్పరం దూరం జరిగాయి. తర్వాత ఆ తర్వాత ఆ మాటే వినిపించడం లేదు' అని కూటమి ట్రంప్‌తో ఉన్నారు.

డాలర్‌తో ఆటలాడితే వాణిజ్య యుద్ధమే

డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీ తీసుకురావాలని బ్రిక్స్ దేశాలు ఆలోచిస్తున్నాయనే వార్తలపై ట్రంప్ గతంలో ఘాటుగా స్పందించారు. మోదీతో భేటీకి ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బ్రిక్స్' ఒక చెడ్డ ప్రతిపాదనను తెచ్చింది. దీనిని ఎవరూ అంగీకరించరు. డాలర్‌తో ఆటలాడితే 150 శాతం సుంకాలు విధిస్తానని నేను చేసిన హెచ్చరికతో ఇప్పుడు ఆ ప్రతిపాదన గురించి మాట్లాడేందుకు వారు (బ్రిక్స్ దేశాలు) భయపడుతున్నారు. ఒకవేళ ఈ ప్రతిపాదనను అమలు చేసిన వారు అనుకుంటే మళ్లీ నా దగ్గరకు వచ్చి సుంకాలు వద్దని అడుక్కోవాల్సి వస్తుంది. ఈ మాట నేను చెప్పిన మరుక్షణమే బ్రిక్స్ అంతమైంది' అని ట్రంప్ అన్నారు.అంతర్జాతీయ వాణిజ్యంలో కానీ మరెక్కడైనా కానీ అమెరికన్ డాలర్‌ను భర్తీ చేసే అవకాశం బ్రిక్స్‌కు లేదు, ఒకవేళ ఏ దేశమైనా ఆ ప్రయత్నం చేస్తే సుంకాలకు హలో చెప్పి అమెరికాకు గుడ్‌బై చెప్పాల్సి వస్తుందని స్పష్టం చేశారు. బ్రిక్స్ సభ్య దేశాలలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజి ప్టు, ఇథియోపియా, ఇరాన్, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉన్నాయ్. ఈ గ్రూపునకు ఉమ్మడి కరెన్సీ ఏదీ లేనప్పటికీ ఉక్రెయిన్‌తో యుద్ధం అనంతరం అనేక పశ్చి మ దేశాల నుంచి రష్యా ఈ అంశంపై చర్చలు జరిపింది. జోరందుకున్నాయి.

# జగన్ రాకతోనే మిర్చి రైతుల సమస్యలు తెలిసాయి

విశాఖపట్నం,ఏపీలో కక్ష సాధింపు రాజకీయాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి, వైసీపీనేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. జగన్ నేరుగా వెళ్లి మిర్చి రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారని తెలిపారు. ఆ పర్యటన తర్వాతే మిర్చి రైతులు సమస్య ప్రభుత్వానికి తెలిసిందని అన్నారు. ఢిల్లీలో సంబంధిత మంత్రి లేకపోయినా మిర్చి రైతుల సమస్యలు కోసం మాట్లాడటానికి వెళ్తున్నామని సీఎం చంద్రబాబు ఎలా చెబుతారని ప్రశ్నించారు. జగన్ వెళ్తే కానీ మిర్చి రైతులు ఇబ్బందులు ప్రభుత్వానికి తెలియలేదా అని నిలదీశారు. ఈ ప్రభుత్వానికి రైతులు, వ్యవసాయం పట్ల చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. మిర్చి రైతుల సమస్యలు తెలుసుకోవడానికి జగన్ వెళ్తే ఈల్లీగల్ యాక్టివిటీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. తమరి మ్యూజికల్ నైట్‌కు వెళ్లడం ఏ ఆక్టివిటీ అవుతుందని నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ప్రాధాన్యం లేదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. భూ కుంభకోణాలపై వేసిన సిటీ నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆది ఏ ప్రభుత్వ హయాంలో జరిగిన నివేదిక బయటపెట్టాలన్నారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యక్తిగత అజెండాతో మాట్లాడుతున్నారని విమర్శించారు. వ్యక్తిగత ఎజెండాలకు రాజకీయాల్లో తావులేదని చెప్పారు. జగన్మోహన్ రెడ్డికి మిర్చి యార్డ్‌కు వెళ్లవద్దని ఎన్నికల కమిషన్ ఏం చెప్పలేదని అన్నారు. కోడి కత్తి కేసులో జగన్మోహన్ రెడ్డి



హాజరకాకపోతే కోర్టు నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. గ్రూప్ 2లో రోస్టర్ విధానంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. అభ్యర్థులకు ఇబ్బంది పెట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలు పూర్తిగా అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు వైసీపీ దూరంగా ఉందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

# నన్ను తేలిగ్గా తీసుకోవద్దు.. ఏక్‌నాథ్ షిండే స్ట్రాంగ్ వార్నింగ్



ముంబై: తనకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎటువంటి విభేదాలు లేవని గతవారం వ్యాఖ్యానించిన డిప్యూటీ సీఎం ఏక్‌నాత్ షిండే. తాజాగా తనను తేలిగ్గా తీసుకోవద్దంటూ సుతిమెత్తగా హెచ్చరించారు. అయితే ఈ హెచ్చరిక నేరుగా ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కు కాకపోయినా, షిండే ఇలా వ్యాఖ్యానించడం వెనుక ఆంతర్యం ఏమిటో అనేది రాజకీయ వర్గాల్లో మరోసారి హాట్ టాపిక్ అయ్యింది.ఈరోజు(శుక్రవారం) ఏక్ నాథ్ షిండే మీడియాతో మాట్లాడుతూ.. ' నా గురించి తెలుసు. నేను పార్టీలో సామాన్య కార్తకర్తని. నేను అలాగే భావిస్తాను. అదే సమయంలో బాలా సాహెబ్ కు కూడా కార్యకర్తనే. నన్ను గతంలో తేలిగ్గా తీసుకున్న ప్రభుత్వం ఏమైందో మీకు తెలుసు.' అంటూ హెచ్చరించారు. మహారాష్ట్ర అసెంబ్లీలో షిండే నేతృత్వంలోని శివసేనకు 57 ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఫడ్నవీస్ ప్రభుత్వానికి సూచాయాగా వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. తనను తేలిగ్గా తీసుకోవద్దంటూనే గత ప్రభుత్వాన్ని కూల్చిన సందర్భాన్ని షిండే తాజాగా గుర్తు చేసుకోవడమే రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఇది ఫడ్నవీస్ ను పరోక్షంగా హెచ్చరించినట్లేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాను తలుచుకుంటే ప్రభుత్వాన్ని కూల్చే అవకాశం లేకపోలేదనే సంకేతాలు పంపినట్లు అయ్యిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఫడ్నవీస్ సమావేశాలకు షిండే దుమ్మా..

మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ నేతృత్వంలో జరిగే పలు సమావేశాలకు షిండే తరుచు గైర్హాజరు కావడంతో వారి మధ్య విభేదాలున్నాయనే దానికి అద్దం పడుతోంది. షిండే గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆమోదించిన రూ. 900 కోట్ల ప్రాజెక్టును ప్రస్తుత సీఎం ఫడ్నవీస్ నిలిపివేయడంతో వీరి మధ్య అగ్నికి ఆజ్యం పోసిందనే వాదన తెరపైకి వచ్చింది. జల్నాలో తాను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆమోదించిన ప్రాజెక్టును సీఎం హోదాలో ఉన్న ఫడ్నవీస్ ఆపడమే షిండేకు కోపం తెప్పించినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఫడ్నవీస్ క్యాబినెట్ సమావేశాలకు షిండే దూరంగా ఉన్నట్లు సమాచారం.

2022లో ఇలా..

మూడేళ్ల క్రితం ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు షిండే. 40 మంది ఎమ్మెల్యేలతో బయటకొచ్చేశారు. ఫలితంగా మహా వికాస్ అగాడీ ప్రభుత్వం కూలిపోయింది. ఆ తరుణంలో బీజేపీకి మద్దతు ఇచ్చి ముఖ్యమంత్రి అయ్యారు షిండే.ఇక 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే నేతృత్వంలోని మహాయుతి 232 మంది ఎమ్మెల్యేలను సొంతం చేసుకుంది. బీజేపీ 132 సీట్లు గెలవగా, శివసేన 57 మంంది ఎమ్మెల్యేలను, ఎన్సీపీ 41 మంది శాసనసభ స్థానాలను కైవసం చేసుకుంది. దాంతో సీఎం పదవి అనేది ఫడ్నవీస్ ను వరించింది. ఆ సమయంలో తనుకు ఇవ్వబోయే డిప్యూటీ సీఎం పదవిని షిండే తిరస్కరించారు. కొన్ని బుజ్జగింపుల తర్వాత దానికి కట్టుబడ్డారు షిండే.

గతవారం అలా.. ఇప్పుడు ఇలా

తనకు ఫడ్నవీస్ తో ఎటువంటి విభేదాలు లేవని షిండే గతవారం వ్యాఖ్యానించారు. మా మధ్య ఎటువంటి కోల్డ్ వార్ నడవడం లేదన్నారు షిండే. తాము కలిసి కట్టుగానే అభివృద్ధిని అడ్డుకుంటున్న వారిపై యుద్ధం చేస్తామన్నారు.అయితే తాజాగా షిండే స్వరంలో కాస్త మార్పు కనిపించింది. 'నేను విధాన సభలో తొలి ప్రసంగం ఇచ్చినప్పుడు రెండొందలపైగా సీట్లు వస్తాయని ఫడ్నవీస్ అన్నాను. మాకు 232 సీట్లు వచ్చాయి. నన్ను తేలిగ్గా తీసుకోవద్దనే విషయం ఎవరిని ఉద్దేశించి చెప్పానో వారికి అర్థమైతే చాలు' అంటూ ముక్తాయించారు ఏక్‌నాత్ షిండే

# ఇప్పటికే వాటాకు మించి నీటిని వినియోగించిన ఎపి




హైదరాబాద్,ఇప్పటికే వాటాకు మించి నీటిని ఉపయోగించుకున్న ఆంధ్రప్రదేశ్.. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీరు తీసుకోకుండా నిలువరించాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డును తెలంగాణ ప్రభుత్వం మరోమారు కోరింది. శుక్రవారం తలపెట్టిన బోర్డు ప్రత్యేక సమావేశం వాయిదా పడిన తరుణంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, నాగార్జున సాగర్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్.. జలసౌధలో కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్‌ను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాహుల్ బొజ్జా.. బోర్డుకు లిఖితపూర్వకంగా లేఖ అందించారు. ఏపీ ఇప్పటికే వాటాకు మించి నీటిని వాడుకొందన్న తెలంగాణ అధికారులు.. ఇక నుంచి ఉమ్మడి జలాశయాల నుంచి ఏపీ నీటిని తీసుకోరాదని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా నిలువరించాలని డిమాండ్ చేశారు. మే నెల వరకు తెలంగాణకు 107 టీఎంసీల నీరు ఇవ్వాలని బోర్డుకు ఇండెంట్ ఇచ్చారు. ఇవాళ జరగాల్సిన ప్రత్యేక సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ కోరినందున, ఆ రోజు సమావేశంలో చర్చించే వరకు శ్రీశైలం, సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా చూడాలని తెలంగాణ అధికారులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పదేపదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ బోర్డు తగిన విధంగా స్పందించడం లేదని తెలంగాణ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేంద్ర మంత్రి నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ అమలు చేయడం లేదని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com